

విద్యుత్ వెలుగుల్లో కురవిలోని వీరభద్రస్వామి ఆలయం

మహిమాన్వితుడు.. శ్రీ వీరభద్రుడు

- మహా శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి స్వామి వారి కల్యాణం
- కురవికి లక్షలాదిగా తరలిరానున్న భక్తులు
- 16 రోజుల పాటు ఘనంగా ఉత్సవాల నిర్వహణ

భక్తుల కోరికలు తీర్చే పరమభోళామూర్తి

కురవి, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక శైవక్షేత్రాల్లో ప్రఖ్యాతి గాంచినది కురవి శ్రీవీరభద్ర స్వామి ఆలయం. భారతదేశంలో ఎన్నో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయాలు ఉన్నప్పటికీ, పడమట ముఖమండపం కలిగిన అరుదైన దేవాలయం మహబూబాబాద్ జిల్లా కురవిలో మాత్రమే ఉంది. నిరీశ్వర దక్షయజ్ఞ కారణంగా పరమేశ్వరుని సంకల్పంతో జన్మించిన వీరభద్రుడు మహోగ్ర స్వరూపుడైన అఖండ మహిమాన్వితుడు. వీరభద్రస్వామి మహిమలు అనంతములై శివుని ఆజ్ఞ మేరకు కురవిలో వెలిసిన దేవాలయం ఇది. వీరభద్రుడంటే దిక్కుతోచని భక్తులను ఆదుకునే పరమభోళామూర్తి, సంతాన ప్రదాత. వీరభద్రుని పేరువింటే భూత, ప్రేత, పిశాచాలు, సర్పదోషాలు, క్షుద్రశక్తులు దరిచేరవు.



భద్రకాళి సమేత కురవి వీరభద్రస్వామి

దక్షుని యజ్ఞ వినాశనానికి వీరభద్రుని ఉద్భవం..

పురాణాల చరిత్ర ప్రకారంగా.. శివునికే మానసిక ఉపశమనాన్ని కలుగచేసిన మహత్తర పరాక్రమవంతుడు శివ మానసపుత్రుడు శ్రీవీరభద్రుడు. శివద్రోహి అయిన దక్షుడు పరమేశ్వరుని అవమానించడానికి భృగు మహర్షి సారథ్యంలో చేసిన నిష్ఫల కార్యమే దక్షయజ్ఞం. తన తండ్రి దక్షుడు తలపెట్టిన యాగాన్ని గూర్చి తెలుసుకున్న సతీదేవి అట్టి యాగాన్ని చేయకుండా నిలువరించడానికి దక్షుని యాగశాలకు వెళ్లింది శంకరపత్ని సతీదేవి. సతీదేవి ప్రయత్నాలు ఫలించలేదు. దక్షుని బుద్ధి మారలేదు. కైలాసం, తనను వీడి దక్షుని యజ్ఞవాటికకు వెళ్లవద్దని పరమేశ్వరుడు ముందుగానే తన అర్థాంగి సతీమణికి చెప్పాడు. శివద్వేష బుద్ధిమార్చి నిరీశ్వర యాగాన్ని మాన్పించే అవకాశం కల్పించమని, అందుకు దక్షుని ఇంటికి, తనపుట్టింటికి వెళ్లేందుకు అనుమతించమని శివున్ని కోరుకుంది. సతీదేవి వెంట వెళ్లాల్సిందిగా నందికి, భృంగికి అనుమతినిచ్చి ఏకాగ్రధ్యానంలో నిమగ్నమయ్యాడు. కైలాసం అంతా ప్రళయం ముందు ప్రశాంతత ఆవరించింది. దక్ష యజ్ఞవాటికలో ప్రవేశించిన సతీదేవికి అవమాన పరంపర ఎదురైంది. శివ దూషణను విని మిక్కిలి రోదించిన సతీదేవి ఎడమకాలి బొటన వేలును భూమిపై రాసి యోగాగ్నిని సృష్టించుకొని ఆత్మార్పణ గావించింది సతీదేవి. ఈ దృశ్యం చూసిన దేవతలు, మహర్షులు స్థాణువులైనారు. భూమి ఆకాశములు ఏకమైనట్లు శివగణములు రోదించినవి. దీంతో ఆగ్రహించిన పరమేశ్వరుడు జటాజూటం నుంచి ఓ జడసూలాగి కైలాస పర్వతంపై మోదినాడు. ఆ జడ రెండుపాయలుగా చీలినది. అందునుంచి మొదటగా వీరభద్రస్వామి, తదుపరి భద్రకాళి ఉద్భవించెను. వీరభద్రుడు ప్రళయాగ్ని స్వరూపుడై వెయ్యి చేతులతో లెక్కలేనన్ని ఆయుధాలతో, అరుణ వర్ణమైన నేత్రాలతో మూలవిరాట్టుగా వెలిగిపోతూ శివుని ఆదేశాల మేరకు దక్షుని యజ్ఞం వినాశనం చేశాడు. దేవతా గణాలకు, యజ్ఞాన్ని పోత్సహించిన భృగుమహర్షికి వీరభద్రుని చేతిలో పరాజయం, పరాభవం ఎదురైంది. దక్షుని తలను మండుతున్న యజ్ఞగుండంలోకి పడేశాడు వీరభద్రుడు. భద్రకాళిమాత కూడా పరాక్రమంలో వీరభద్రునికి తీసిపోలేదు. ఆ తర్వాత దక్షున్ని, మరణించిన వారిని మన్నించి తిరిగి బతికించాడు ఈశ్వరుడు.



1990 సంవత్సరానికి ముందు పురాతన వీరభద్రస్వామి ఆలయం

ఆ తర్వాత కురవి చరిత్ర..

ప్రస్తుతం మండల కేంద్రంగా ఉన్న కురవి ఒకప్పుడు మహోన్నత దశనందుకున్న నగరం. వేంగి రాజధానిగా ఆంధ్రదేశాన్ని పరిపాలించే రోజుల్లో రాష్ట్ర కూటులచే పరాజితుడైన భీమరాజు ఈ కురవి నగరాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలిస్తున్న కాలంలో వీరభద్రస్వామి ఆలయాన్ని నిర్మించినట్లు శిలాశాసనాల ద్వారా తెలుస్తోంది. నాటి వేంగి చాళుక్యుల అనంతరం ఈ దేవస్థానాన్ని కాకతీయ తొలి స్వతంత్ర రాజైన ఒకటో బేతరాజు పునరుద్ధరించినట్లు తెలుస్తుంది. తరువాత కాలంలో రెండో బేతరాజు, కురవి పట్టణాన్ని ఆనుకుని ఉన్న చెరువును తవ్వించినట్లు అనేక ఆధారాలు ఉన్నాయి. విదేశీ యాత్రికుడు 'మార్కోపోలో' రచనల్లో కురవి ఆలయం ప్రసక్తి ఉంది. కాగా, తూర్పు చాళుక్యరాజైన వీరభద్రుని వివాహమాడిన కాకతీయ సామ్రాజ్ఞి రుద్రమాదేవి ఈ కురవి దేవాలయాన్ని సందర్శించినట్లు మార్కోపోలో తన రచనలో పేర్కొన్నాడు. వీరభద్రస్వామి చుట్టూ కురవి పట్టణం ఏర్పడినట్లు, వేంగీ చాళుక్యుల రెండో రాజధాని నగరంగా మహోన్నత శిఖరాలు అధిరోహించి సాహితీ సాంస్కృతిక రంగాలలో ఎనలేని వైభవాన్ని చవి చూసినట్లు చరిత్ర వల్ల తెలుస్తోంది.

ఆలయ విశేషాలు..

కురవి దేవాలయం అష్టాదశ స్తంభాల మహా ప్రాకార మండపంతో మూడు గర్భాలయాలతో విస్తరించబడి ఉంది. సకల శక్తిమూర్తి, వరప్రధాత అయిన వీరభద్రేశ్వర స్వామి భద్రకాళి సమేతంగా ఉండటం వల్ల ఈ ఆలయం 'వీరభద్రేశ్వరాలయం'గా ప్రసిద్ధిపొందింది. మూలవిరాట్ వీరభద్రస్వామి త్రినేత్రుడై దశహస్తాలతో రౌద్రరూపంగా ఉండటం విశేషం. స్వామి వారి నోటికిరువైపులా రెండుకోరలు, పాదాల చెంత నందీశ్వరుడు ఉండగా ఎడమవైపు భద్రకాళి విగ్రహం ఉంది. సుమారు నాలుగడుగుల గండశిలతో సకలాభరణాలతో స్వామివారిని చెక్కిన తీరు వర్ణనాతీతం.

రేపటి నుంచి అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు షురూ..

ఫిబ్రవరి 25వ తేదీ మంగళవారం సాయంత్రం అంకురార్పణతో వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మహాశివరాత్రి బుధవారం రాత్రి సందర్భంగా వీరభద్రస్వామి, భద్రకాళిమాత వివాహం జరుగనుంది. ఈ వివాహానికి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. 16 రోజుల పాటు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి.



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న బండి సంజయ్

వరి వద్దంటే కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి..

- ఆ పార్టీని గెలిపిస్తే 14 నెలల్లో ఏం ఒరిగింది?
- కాళేశ్వరంను సర్వనాశనం చేసింది బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లే..
- కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి..
- ఎమ్మెల్సీగా బీజేపీయేతర అభ్యర్థులను గెలిపిస్తే కాంగ్రెస్ గూటికే...
- ఎమ్మెల్సీ ప్రచారంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

6



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

పక్కా ప్లాన్‌తోనే హత్య

- వీడిన రాజలింగమూర్తి హత్య కేసు మిస్టరీ
- రెండు భూ వివాదాలే హత్యకు కారణం
- రెండు నెలల ముందే స్కెచ్.. అదును చూసి దాడి
- పది మందిపై కేసు నమోదు
- ఏడుగురి అరెస్టు, పరారీలో ముగ్గురు
- వివరాలు వెల్లడించిన భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

6

నేడు ఎమ్మెల్సీ కవిత పర్యటన

- మానుకోటలో ఏర్పాట్లను పరిశీలించిన మాజీ ఎంపీ కవిత



మహబూబాబాద్ బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత

మహబూబాబాద్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచిమానుకోట జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలోని దంతాలపల్లి మండలం రామనుజపురంకు ఉదయం 9 గంటలకు చేరుకుంటారు. అక్కడ ఎమ్మెల్సీ కవిత సౌజన్యంతో ఏర్పాటు చేసిన కేసీఆర్ ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. మరిపెడ మండలం చిల్లంచర్లలో ఉదయం 9.45 గంటలకు జాగృతి నాయకురాలు వరిపెల్లి మాధవి నూతన గృహ ప్రవేశానికి హాజరవుతారు. 10.30 గంటలకు కురవి వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. 11.15 గంటలకు కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి యార్డ్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు మానుకోటలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో నిర్వహించే విలేకరుల సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కేసముద్రం మండలం అన్నారంలో గాయకులు మానుకోట ప్రసాద్ ఇంటిని సందర్శిస్తారు. అనంతరం అక్కడ నుంచి భూపాలపల్లి జిల్లాకు బయలుదేరి వెళ్తారు. కాగా, మహబూబాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మార్నేని వెంకన్న, మర్రి రంగారావు, యాళ్ల మురళీధర్‌రెడ్డి, షేక్ మహబూబ్‌పాష, నీలం దుర్గేష్ పాల్గొన్నారు.



సిల్వర్ మెడల్‌ను సాధించిన అంజయ్యను అభినందిస్తున్న డీజీపీ జితేందర్

కానిస్టేబుల్ అంజయ్యకు డీజీపీ అభినందన

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి) : ఝార్కండ్ రాష్ట్రం రాంచిలో జరిగిన 68వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో సిల్వర్‌మెడల్ సాధించిన మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన కానిస్టేబుల్ అంజయ్యను రాష్ట్ర డీజీపీ జితేందర్ అభినందించారు. ఇంటలిజెన్స్ సెక్యూరిటీవింగ్ ఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటర్ ఇంటలిజెన్స్ ట్రైనింగ్ అకాడమీలో అంజయ్య రెండు నెలల పాటు శిక్షణ పొందారు. ఈనెల 10వ తేదీ నుంచి 15 వరకు రాంచిలో జరిగిన పోలీస్‌డ్యూటీ మీట్‌లో యాంటీ సబటేజ్ చెక్‌రూమ్ సర్చ్ విభాగం వీవీఐపీ, వీఐపీలు నివాసముండే గదుల్లో ఎలాంటి హానికర వస్తువులు లేకుండా చూసుకునే విధానంలో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొన్న కానిస్టేబుల్ అంజయ్య అత్యంత ప్రతిభ కనపర్చి సిల్వర్ మెడల్ సాధించారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సిల్వర్‌మెడల్ సాధించిన అంజయ్యను డీజీపీ జితేందర్ అభినందించారు.

సైకిల్‌పై వచ్చి.. ఇంట్లో చోరీ

- 3 తులాల బంగారు ఆభరణాలు, రూ.5 వేల నగదు అపహరణ

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని మార్వాడీ బజారులో ఓ వ్యక్తి ఆదివారం తెల్లవారుజామున 5గంటల ప్రాంతంలో సైకిల్‌పై వచ్చి.. అదే కాలనీలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. మహబూబాబాద్ టౌన్ సీఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం. మర్వాడీ బజారుకు చెందిన కొండ్లె శ్రీనివాస్-సాయిప్రసన్న తెల్లవారుజామున 5గంటల ప్రాంతంలో ఇంటికి తలుపులు తీసి నిద్రిస్తున్న క్రమంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి సైకిల్‌పై వచ్చి ఇంట్లో ఉన్న రూ.5వేల నగదు, సాయిప్రసన్న మెడలో ఉన్న పుస్తెలతాడును అపహరించుకుపోయాడు. అప్పటికే వారు మెల్కొని కేకలు వేయడంతో దొంగ వచ్చిన సైకిల్‌పై పరారయ్యాడు. బాధితుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



మహదేవునిగూడెం నుంచి శిక్షణకు ఉట్నూరు వెళ్లిన డ్వాక్రా మహిళలు

ఇప్పపూలతో లడ్డు తయారీ శిక్షణ

ఉట్నూరులో డ్వాక్రా మహిళల పర్యటన

గంగారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నీతి ఆయోగ్‌లో భాగంగా మహదేవునిగూడెం గ్రామానికి చెందిన డ్వాక్రా గిరిజన మహిళలకు ఇప్పపూలతో లడ్డూ తయారీలో శిక్షణ ఇప్పించినట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రత్యూష ఆదివారం తెలిపారు. అందుకుగాను గంగారం మండలం మహదేవుని గూడెం నుంచి కొంతమంది చురుకైన డ్వాక్రా సంఘం మహిళలను ఎంపిక చేసి, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరుకు బస్‌లో తీసుకెళ్లి, వారికి రెండు రోజులు శిక్షణ ఇప్పించినట్లు పేర్కొన్నారు. నీతి ఆయోగ్ అభివృద్ధిలో అడవుల నుంచి గిరిజనులు సేకరించే అటవీ సంపదైన ఇప్పపూలతో లడ్డూలు తయారు చేసి, వాటిని ఐసీడీఎస్‌లో గర్భిణులకు, ప్రభుత్వ వసతి గృహంలోని బాలికలకు పంపిణీ చేయటంతో వారిలో రక్తహీనత తగ్గి, చురుకుతనం వస్తున్నదని గ్ర హించామన్నారు. ఉట్నూరులో ఈ స్కీం విజయవంతం కావటంతో తాము గంగారంలో ఎక్కువగా లభించే ఇప్పపూలను లడ్డూలుగా తయారు చేసే ప్రక్రియను ఎంచుకున్నామన్నారు. శిక్షణ పొందినవారు ఈ లడ్డూ తయారుకు ముందుకు వస్తే నీతి ఆయోగ్ నుంచి కానీ, ఐటీడీఏ ఏటూ రునాగారం నుంచి కానీ ఆర్థిక సహాయం అందించి మహిళలను ఆదుకుంటామని ప్రత్యూష తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు సీడీపీవో నీలోఫర్ ఆజ్మీ, సురేస్, కొండల్‌రావు, విజయ, శ్రీనివాసరావు, రమేష్, మంజుల, శ్రీనాథ్, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



కొత్తగూడలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

- జిల్లాలో 5,046 మంది విద్యార్థుల హాజరు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన సాంఘిక సంక్షేమ గురుకుల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ఆదివారం జరిగినట్లు పాఠశాలల కో-ఆర్డినేటర్ జాక్విలిన్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో జిల్లాలో 5వ తరగతి నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాలకు 5,263 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, జిల్లా వ్యాప్తంగా 15 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటల వరకు నిర్వహించిన ఈ పరీక్షకు 5,046 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. కాగా, 5వ తరగతిలో ప్రవేశాల కోసం వీటీజీ సెట్ అన్ని గురుకులాల సంయుక్త పరీక్షకు 2,693 మంది దరఖాస్తు చేసుకోగా 2,641 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. 6వ తరగతిలో 1,022 మంది హాజరుకానుండగా, 929 మంది పరీక్ష రాశారు. 7వ తరగతిలో 628 మంది హాజరు కానుండగా 603 మంది ఎగ్జామ్ రాశారు. 8వ తరగతిలో 563 మందికి గాను 539 మంది హాజరయ్యారు. 9వ తరగతిలో 357 మందికి గాను 324 మంది హాజరైనట్లు తెలిపారు.

మేడారంలో పోటెత్తిన భక్తులు

పూజారుల వనభోజనాలు

తాడ్వాయి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు కావడంతో వివిధ ప్రాంతల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించుకన్నారు. అనంతరం సమ్మక్క- సారలమ్మ గద్దెలకు చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. 50వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా పూజారుల వనభోజనాలు

మేడారంలో వనదేవతల పూజారులు ఆదివారం ఘనంగా వనభోజనాలు నిర్వహించుకున్నారు. మినీ జాతర తిరుగువారం ముగిసిన తర్వాతి ఆదివారం వనభోజనాలకు వెళ్లడం ఆనవాయితీ. ఇందులో భాగంగా పూజారులు వనభోజనాలకు వెళ్లి యాట, కోడి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ దేవతలకు పూజలు చేసి అడవికి వెళ్లి వనదేవతలకు పూజలు చేశారు. అక్కడ బలి మొక్కులు చెల్లించుకుని కుటుంబ సమేతంగా, బంధుమిత్రులతో కలిసి దేవతలకు నైవేద్యాలు సమర్పించారు.

మినీజాతర హుండీల లెక్కింపు ఎప్పుడు?

మేడారం మినీజాతర ముగిసి వారందాటినా అధికారులు భక్తుల కానుకలను ఎందుకు లెక్కించడం లేదని పూజారులు అడుగుతున్నారు. గతంలో జాతరలు ముగిసిన వెంటనే లెక్కింపు జరిగేదని గుర్తు చేసున్నారు. మేడారంలో భద్రత సమస్య ఉందని అధికారులు తెలుపుతూనే 54 హుండీల లెక్కింపులో జాప్యం చేస్తున్నారని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ హుండీలను ప్రత్యేక గదిలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో భద్రపరిచినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టు కేసు విషయంలోనే హత్య

- మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, హరిబాబు ప్రమేయం ఉంది
- భూవివాదానికి, హత్యకు సంబంధం లేదు
- సీబీసీఐతో విచారణ చేపట్టాలి
- హతుడు రాజలింగమూర్తి భార్య నాగవెల్లి సరళ



సమావేశంలో మాట్లాడుతున్న మృతుడి భార్య నాగవెల్లి సరళ

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసు విషయంలోనే తన భర్త రాజలింగమూర్తిని హత్య చేశారని ఆయన భార్య, మునిసిపల్ మాజీ కౌన్సిలర్ నాగవెల్లి సరళ ఆరోపించారు. భూపాలపల్లి పట్టణ పరిధి ఫక్కీర్‌గడ్డలోని తన నివాసంలో ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని బీఆర్‌ఎస్ పెద్దలపై రాజలింగమూర్తి కేసు వేశారని గుర్తుచేశారు. ఆ కేసులో రాజలింగమూర్తికి అనుకూలంగా తీర్పు వస్తుందనే ఉద్దేశంతోనే ఆయన్ను హత్య చేశారని విమర్శించారు. భూవివాదం కారణంగానే హత్య జరిగిందనడం అవాస్తవమన్నారు. భూవివాదమే కారణమైతే ఈ కేసులోకి మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ హరిబాబు ఎలా వచ్చారని ఆమె ప్రశ్నించారు. ఈహత్యపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, హరిబాబుతో పాటు బీఆర్‌ఎస్ పెద్దలు కేసీఆర్, కేటీఆర్‌ల ప్రమేయం ఉందనే అనుమానం తనకు ఉందన్నారు. వారిపై చర్యలు తీసుకొని తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ హత్య కేసును సీబీసీఐడీకి అప్పగించి విచారణ జరపించాలన్నారు. విలేకరుల సమావేశంలో రాజలింగమూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

– మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య

సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసును హైకోర్టు సిట్టింగ్ జడ్జికి అప్పగించాలని మానవహక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబాన్ని మానవ హక్కుల వేదిక నాయకులు ఆదివారం పరామర్శించారు. హత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ హత్య కేసులో బీఆర్‌ఎస్ రాజకీయ ప్రముఖుల హస్తం ఉందని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో మానవ హక్కుల వేదిక నిజ నిర్ధారణ బృందం వివరాలను సేకరించినట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని 2023 అక్టోబరులో వేసిన కేసు హైకోర్టులో విచారణ జరుగుతోందన్నారు. ఈక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రధాన అనుచరుడిగా ఉన్న కొత్త హరిబాబు ఈ హత్య కేసులో కుట్రదారుడిగా ఉన్నాడన్నారు. హత్యలో స్వయంగా పాల్గొన్న ఒక ప్రధాన నిందితుడు హరిబాబుకు ఫోన్ చేసి డబ్బుల గురించి అడిగిన విషయం పోలీసుల విచారణలో వెల్లడైందన్నారు. హరిబాబుకు రాజలింగమర్తిని చంపాల్సిన వ్యక్తిగత అవసరం లేదని, బీఆర్‌ఎస్ అధినాయకులే అవినీతి విచారణ నుంచి తప్పించుకోవడానికి హరిబాబుతో హత్య చేయించారని మృతుడి భార్య కూడా ఆరోపిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బదావత్ రాజు, రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.హరికృష్ణ, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్, చంద్రగిరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్లాన్‌తోనే హత్య

- రెండు నెలల ముందే స్కెచ్
- వీడిన రాజలింగమూర్తి హత్య కేసు మిస్టరీ
- రెండు భూవివాదాలే హత్యకు కారణం
- సహకరించిన మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్
- పది మందిపై హత్య కేసు నమోదు
- ఏడుగురి అరెస్టు, పరారీలో ముగ్గురు
- వివరాలు వెల్లడించిన భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే



విలేఖరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాల్లో జోక్యం చేసుకోవడం, అవసరమైతే కోర్టులను ఆశ్రయించడమే సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి ప్రాణాలకు ముప్పును తెచ్చిపెట్టింది. ఆయన హత్యకు రెండు భూవిదాలే కారణమని పోలీసులు తేల్చడం కలకలం రేపింది. ఈకేసులో పది మంది ఉండగా వీరిలో బీఆర్‌ఎస్ నేత, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ ప్రమేయం ఉందని పోలీసులు గుర్తించడం చర్చనీయాంశమైంది. రాజలింగమూర్తి హత్యకు రెండు నెలల క్రితమే పక్కా ప్లాన్ వేశారని, అదును చూసి ఆయనపై దాడి చేసి చంపారని పోలీసుల విచారణలో వెల్లడైంది.

ఎట్టకేలకు వీడిన మిస్టరీ

భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఇటీవల చోటు చేసుకున్న సామాజిక కార్యకర్తల నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసు మిస్టరీ వీడింది. ఈ హత్యకు రెండు భూ వివాదాలు కారణమని పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో పది మందిపై కేసులు నమోదు చేశారు. వీరిలో ఏడుగురిని పోలీసులు ఆదివారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలను ఎస్పీ కిరణ్ ఖరే వెల్లడించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఎస్పీ మాట్లాడారు.

రాజలింగమూర్తి హత్య కేసులో పది మంది పాత్ర ఉందని గుర్తించామని ఎస్పీ వివరించారు. వీరిలో భూపాలపల్లి పట్టణానికి చెందిన రేణికుంట్ల సంజీవ్, పింగిళి సేమంత్ అలియాస్ బబ్లూ, మోరే కుమార్, కొత్తూరి కిరణ్ అలియాస్ కుమార్ హత్య చేసిన వారిలో ఉన్నారని తెలిపారు. వీరికి రేణికుంట్ల కొమురయ్య, దాసరపు కృష్ణ, రేణికుంట్ల సాంబయ్యపాటు మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కొత్త హరిబాబు, పుల్లా నరేష్, పుల్లా సురేష్ ఉన్నారని వెల్లడించారు. కొత్త హరిబాబుతో పాటు పుల్లా నరేష్, పుల్లా సురేష్ పరారీలో ఉండగా మిగిలిన ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపించినట్లు ఎస్పీ తెలిపారు. రేణికుంట్ల సంజీవ్ ఏ1గా, పింగిళి సేమంత్ అలియాస్ బబ్లూ ఏ2గా, మోరే కుమార్ ఏ3, కొత్తూరి కిరణ్‌అలియాస్ కుమార్ ఏ4, రేణికుంట్ల కొమురయ్య ఏ5, దాసరపు కృష్ణ ఏ6, రేణికుంట్ల సాంబయ్య ఏ7, కొత్త హరిబాబు ఏ8, పుల్లా నరేష్ ఏ9, పుల్లా సురేష్ ఏ10 నిందితులుగా ఉన్నారని వివరించారు.

రెండు భూ వివాదాలే హత్యకు కారణం

రాజలింగమూర్తి హత్యకు రెండు భూ వివాదాలే ప్రధాన కారణంగా గుర్తించినట్లు ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న సర్వే నెంబర్ 319లోని 2.25 ఎకరాల భూమి విషయంలో ఏ1 నిందితుడిగా ఉన్న రేణికుంట్ల సంజీవ్, వారి కుటుంబీకులకు వివాదం నడుస్తోంది. నిందితుల కుటుంబీకుల నుంచి మోసపూరితంగా రాజలింగమూర్తి కొంత భూమిని తన పేరు మీద రాయించుకున్నాడు. అప్పటి నుంచి నిందితుల కుటుంబసభ్యులతో తగాదా నడుస్తోంది. ఈ విషయంలో ఇరువురు కోర్టుకు సైతం వెళ్లారు. దీంతో రేణికుంట్ల సంజీవ్ కక్షగట్టాడు. లింగమూర్తిని చంపేస్తే మనకు భూమి వస్తుందని, అదును కోసం ఎదురు చూస్తున్నానని తమ కుటుంబ సభ్యులు, బంధువులతో తరచూ చెప్పేవాడు. ఇదేక్రమంలో భూపాలపల్లిలోని ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న 323 సర్వే నెంబర్‌లోని 16 గుంటల భూమి విషయంలో హనుమకొండకు చెందిన అడ్వకేట్‌కు సంబంధించిన భూమి విషయంలో రాజలింగమూర్తి, మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ హరిబాబు మధ్య వివాదం నడుస్తోంది. చనిపోయిన లాయర్ తరఫున ఆ భూమి విషయంలో హరిబాబుతో రాజలింగమూర్తికి గొడవలు జరుగుతున్నాయి. తనకు జరిగిన అన్యాయంపై రాజలింగమూర్తిని చంపేస్తానని గతంలో సంజీవ్ అనేకసార్లు హరిబాబుకు చెప్పి ఉన్నాడు. రాజలింగమూర్తి తనకు కూడా శత్రువు కాబట్టి అతడిని చంపేస్తే బెయిల్ ఖర్చులు, మిగతావి ఏమైనా ఉన్నా చూసుకుంటానని సంజీవ్‌కు హరిబాబు మాటిచ్చాడు. దీంతో అప్పటి నుంచి రాజలింగమూర్తిని హత్య చేసేందుకు సంజీవ్ అదును కోసం ఎదురు చూస్తున్నాడు.

కాశిబుగ్గలో కత్తులు, రాడ్డు కొనుగోలు..

లింగమూర్తిని ఎప్పటికైనా హతమార్చాలనే కక్షితోనే ఉన్న సంజీవ్ గత రెండు నెలల కిందటే తన బంధువు మోరే కుమార్‌లతో కలిసి వరంగల్‌లోని కాశిబుగ్గ ప్రాంతంలో రెండు కత్తులు, ఒకరాడ్డు కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి లింగమూర్తి కదలికలను గమనిస్తూ వచ్చారు. ఈ నెల 19న ఓ కేసు విషయంలో సంజీవ్ కోర్టుకు హాజరయ్యాడు. ఆ సమయంలో రాజలింగమూర్తి ఆయనకు తారసపడినట్లు ఎస్పీ తెలిపారు. దీంతో కోపోద్రిక్తుడైన సంజీవ్ ఇదివరకే చర్చించిన తన బంధుమిత్రులకు ఫోన్ చేసి ఈ రోజు ఎలాగైనా రాజలింగమూర్తిని చంపుదామని చెప్పాడు. రాజలింగమూర్తి వెంట వస్తూ అతడి కదలికలు గమనించి తనకు సమాచారం ఇవ్వాలని దాసరి కృష్ణ, నరేష్‌కు పురమాయించాడు. సంజీవ్‌తో పాటు కొత్తూరి కిరణ్, మోరే కుమార్, పింగిలి సేమంత్ నలుగురు సంజీవ్ ఇంటి దగ్గర దాచిన కత్తులు, రాడ్లను తీసుకొని రాజలింగమూర్తి ఇంటికి సమీపంలో మాటు వేశారు. ఈ క్రమంలో సాయంత్రం 6:45 గంటల సమయంలో రాజలింగమూర్తి భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరి వెళ్తుండగా ఈ విషయాన్ని సంజీవ్‌తో పాటు మిగిలిన ముగ్గురికి దాసరి కృష్ణ తెలిపాడు. దీంతో నిందితులు నలుగురు రాజలింగమూర్తిపై ఒక్కసారి దాడిచేశారు. ద్విచక్రవాహనంపై నుంచి పడిపోయిన రాజలింగమూర్తి కళ్లలో కారం చల్లి పొట్ట భాగంలో కత్తితో పొడవగా పేగులు బయటకు వచ్చి అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. రాజలింగమూర్తి మృతి చెందాడని నిర్ధారించుకున్న నిందితులు ద్విచక్ర వాహనంపై పరకాల వైపునకు వెళ్లిపోయారు.

బీఆర్‌ఎస్ నాయకుడు హరిబాబు

హత్య కేసులో ఏ8 నిందితుడు కొత్త హరిబాబు బీఆర్‌ఎస్ నాయకుడు. మునిసిపల్ కౌన్సిలర్‌గా కొనసాగుతున్న ఆయన గతంలో వైస్ ఛైర్మన్‌గా కొనసాగాడు. రాలింగమూర్తి హత్య కేసులో ఆయన ప్రమేయం ఉందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలడం చర్చనీయాంశమైంది. ఈ హత్య కేసు నేపథ్యంలో ఆయన పరారీలో ఉన్నాడని ఎస్పీ తెలిపారు. రాజలింగమూర్తిని హత్య చేసిన నిందితులు నలుగురు రెండు ద్విచక్ర వాహనాలపై పరకాల వైపుకు వెళ్లారు. ఓ ద్విచక్ర వాహనంపై ఏ1 నిందితుడు రేణికుంట్ల సంజీవ్, ఏ2 నిందితుడుపింగిలి సేమంత్ అలియాస్ బబ్లూ ఓ వాహనంపై వెళ్తూ మార్గం మధ్యలో గణపురం మండలం శ్యామ్‌నగర్ వద్దకు వెళ్లారు. అక్కడ రోడ్డుపై తమ సమీప బంధువు కల్వల శ్రీనివాస్ ఆగి ఉండటాన్ని గమనించిన నిందితులు అతని వద్దకు వెళ్లి తన ఫోన్ స్విచ్ఛాఫ్ అయిందని, ఇంటికి కాల్ చేసుకోవాలని చెప్పి శ్రీనివాస్ ఫోన్ తీసుకున్నారు. ఆ ఫోన్ నుంచి కొత్త హరిబాబుకు సంజీవ్ కాల్ చేసి మాట్లాడాడు. పని అయిపోయిందని, డబ్బులు కావాలని అడిగాడు. ఆవెంటనే ఇప్పుడు ఫోన్ చేయొద్దని హరిబాబు ఫోన్ కట్ చేసినట్లుగా గుర్తించామని ఎస్పీ కిరణ్‌ఖరే వెల్లడించారు.

నిందితుల నంచి ఆయుధాలు స్వాధీనం

రాజలింగమూర్తి హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రెండు కత్తులు, ఒక రాడ్‌తో పాటు ఐదు మోటర్ సైకిళ్లు, ఏడు మొబైల్ ఫోన్లు, రక్తపు మరకలు ఉన్న దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పరారీలో ఉన్న కొత్త హరిబాబు, పుల్లా నరేష్, పుల్లా సురేష్‌ను త్వరలోనే పట్టుకుంటామని, వారి కోసం రెండు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని ఎస్పీ తెలిపారు. ఈ కేసును చేధించడంలో కీలకంగా వ్యవహరించిన భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ కిరణ్ ఖరే అభినందించారు.

ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

ఇనుగుర్తి(మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్ననాగారంలో ముత్యాలమ్మ తల్లి బోనాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ వేర్వేరుగా హాజరై దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల సందర్భంగా గ్రామంలో ప్రతీ ఇంటిలో తమ బంధువులను ఆహ్వానించుకోవడంతో సందడి నెలకొంది.



చిన్ననాగారంలో ముత్యాలమ్మ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎంపీ కవిత

తొమ్మిది మంది మావోయిస్టుల లొంగుబాటు



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ములుగు ఓఎస్డీ గీతే మహేష్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీకి చెందిన తొమ్మిది మంది దళసభ్యులు ములుగు జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఏఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ములుగు ఓఎస్డీ గీతే మహేష్ బాబా సాహెబ్ వివరాలను వెల్లడించారు. ఆదివాసీల సంక్షేమం కోసం పోలీసులు చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, లొంగిపోయిన మావోయిస్టుల పట్ల చూపుతున్న ఆదరణను ఆకర్షితులై అడవి బాట వీడి జనజీవన స్రవంతిలోకి కలవాలని తొమ్మిది మంది నిర్ణయించుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కాంచల దళ సభ్యులుగా ఉన్న మడకం ఉంగ అలియాస్ ఉంగయ్య, మడకం ఇడ్మి అలియాస్ హిడ్మే, పోడియం కోస అలియాస్ కోసయ్య, సోడి జోగి, కుంజం ఐతే, సోడి బుద్ర, కుంజం కోస, పొడియం ఐతే, కుంజం కోస పోలీసుల ఎదుట లొంగిపోయారని వివరించారు. గత నెల ఎస్పీ శబరీశ్ ఆధ్వర్యంలో చేయూత కార్యక్రమాన్ని నిర్వహించామని, మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న సభ్యులు వెంటనే పోలీసుల ఎదుట లొంగిపోవాలని విజ్ఞప్తి చేశామని ఓఎస్డీ తెలిపారు. మావోయిస్టుల కుటుంబాలను కలిసి పోలీసులకు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసే వారికి కలిగే ప్రయోజనాలు, ఆయా పథకాల ద్వారా చేకూరే లబ్ధి గురించి మావోయిస్టు కుటుంబాలకు తెలియజేశామన్నారు. తాము చేసిన ఈ ప్రయత్నం సత్ఫలితాన్నిచ్చిందని, ఈక్రమంలో తొమ్మిది మంది మావోయిస్టు దళసభ్యులు పోలీసుల ఎదుట లొంగిపోయారని ఓఎస్డీ తెలిపారు. లొంగిపోయిన వారికి జీవనోపాధి, పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, సీ/39 సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సతీష్ కుమార్, ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఎస్.కె.తాజుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

వరి వద్దంటే కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఏమయ్యాయి..
- ఎమ్మెల్సీ ప్రచారంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతున్న బండి సంజయ్

మిల్స్‌కాలనీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వరి వేయవద్దన్న కేసీఆర్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ హెచ్చరించారు.ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన వరంగల్ జిల్లా బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రసంగించారు. వరివేస్తే రైతులకు ఉరే నన్న కేసీఆర్‌కే ప్రజలు ఓటుతో ఉరి వేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో సాగునీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. రైతులు వరిని కాక గంజాయిని సాగు చేయాలా? అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరితో రాష్ట్రంలో వ్యవసాయం చేయాలంటే రైతులు భయపడుతున్నారని అన్నారు. కాళేశ్వరాన్ని కేసీఆర్ సగం మింగేస్తే, మిగతా సగాన్ని కాంగ్రెస్ సర్కార్ మింగేసిందన్నారు. కృష్ణా జలాలను పక్క రాష్ట్రం తీసుకుపోతుంటే కాంగ్రెస్ ఏమీ చేయలేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ కాలంలో ప్రజల పక్షాన పోరాడిన తనపై 109 కేసులు పెట్టించారని, హిందీ ప్రశ్నాపత్రం లీకేజీ కేసు బనాయించి ఫెయిల్ అయ్యారని ఎద్దేవా చేశారు. అంతేగాకుండా 5వేల మంది బీజేపీ కార్యకర్తలపై రౌడీ షీట్లు తెరిచారని అన్నారు. ఎన్నికల హామీలైన ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ సమాజం బీజేపీని మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మనకు ఓట్లు వేయని వారి కోసం మనమెందుకు పోరాడాలని కార్యకర్తలు అడుగుతుంటే సమాధానంచెప్పలేకపోతున్నామన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించి 14 నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని బండి సంజయ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ హామీలైన ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆరింటిలో ఒక్కటైనా ఇప్పటివరకు అమలు చేశారా? అని నిలదీశారు. 25వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 50వేల ఉద్యోగాలను ఎలా భర్తీ చేస్తుందో అర్థం కావడం లేదన్నారు. ఉపాధ్యాయ సంఘాలు పాలక పార్టీలకు కొమ్ముకాస్తూ వారి సమస్యలను గాలికొదిలేస్తున్నాయని ఆరోపించారు. టీఎన్జీవోలు పైరవీల కోసం ప్రగతి భవన్‌కు వెళుతున్నారని విమర్శించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై పోరాడేది బీజేపీయేనని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం 15 శాతం కమీషన్ అడుగుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులు కరువయ్యారని ఎద్దేవా చేశారు. రిటైర్డ్ అయితే ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వాల్సి వస్తుందని కేసీఆర్ 58 సంవత్సరాల ఉద్యోగ విరమణ వయస్సును 61 ఏళ్లకు పెంచితే.. అదే బాటలో రేవంత్ సర్కారు 65 ఏళ్లకు పెంచేందుకు ప్రయత్నాలు ప్రారంభించారని అన్నారు. ఇలాగైతే నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎలా వస్తాయో ఆలోచించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోతామని తెలుసుకుని సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి వస్తున్నారని, కానీ రాహుల్ వచ్చినా బీజేపీ అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కేజీబీవీల ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత, సీఆర్టీల వేతనం రూ.32వేలు, ఎస్వోల వేతనం రూ.52వేలు పెంపు చేయించేది బీజేపీ నేనని హామీ ఇచ్చారు. ఉద్యోగులకు పెద్ద మొత్తంలో ట్యాక్స్ మినహాయింపు ఇచ్చింది మోదీ సర్కారేనన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకొని శాసనమండలి వేదికగా సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. బీజేపీయేతర అభ్యర్థులను గెలిపిస్తే వారు కాంగ్రెస్ గూటికి చేరడం ఖాయమన్నారు.

కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జులప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తిరెడ్డి, వాగ్దేవి కళాశాలల ఛైర్మన్ దేవేందర్‌రెడ్డి, నాయకులు కొండేటి శ్రీధర్, రావు పద్మ, సంతోష్‌రెడ్డి, విజయ్‌చందర్‌రెడ్డి, కాశీప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

విషప్రయోగానికి గురైన బాలిక మృతి




నిత్యశ్రీ (ఫైల్)

డోర్నకల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోగ్యతండాకుచెందిన వాంకుడోతు ఉష ఈ నెల 5న కూల్‌డ్రింక్‌లో తన ఇద్దరు పిల్లలకు గడ్డిమందు కలిపి విషప్రయోగం చేసిన విషయం తెలిసిందే. ఈఘటనలో అస్వస్థతకు గురైన ఇద్దరు చిన్నారుల్లో నిత్యశ్రీ(5) ఆదివారం హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. డోర్నకల్ సీఐ రాజేష్ తెలిపిన ప్రకారం...

జోగ్యతండాకు చెందిన వాంకుడోతు ఉష తన పిల్లలకు కూల్‌డ్రింక్‌లో విషప్రయోగం చేసింది. దీంతో ఈ పిల్లలిద్దరూ అస్వస్థతకు గురికావడంతో వారిని తొలుత ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. అనంతరం వైద్యుల సూచనల మేరకు స్థానికంగానే ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స నందిస్తున్నారు. పిల్లలిద్దరికి విషప్రయోగం చేసిన సంగతి బయటపడడంతో తల్లి ఉష కూడా ఎలుకల మందు తాగి, ఆత్మహత్యాయత్నం చేసుకుని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాగా, అస్వస్థతకు గురైన చిన్నారుల్లో నిత్యశ్రీ మృతి చెందగా, వరుణ్ తేజ్ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఈ ఘటనపై ఉష మరిది వాంకుడోతు రాం బాబు ఈనెల 10న డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రామప్పలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



రామప్పలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

వెంకటాపూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని ప్రఖ్యాత రామలింగేశ్వర స్వామి(రామప్ప) దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. రామలింగేశ్వర స్వామిని మంత్రి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మహాశివరాత్రి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈనెల 26 నుంచి 28 వరకు ఉత్సవాలు జరగనుండగా అదనపు బస్సులు, పారిశుద్ధ్యం, పార్కింగ్, రోడ్ల నిర్వహణ, దేవాలయం వద్ద వసతి సౌకర్యం, తాగునీటి సరఫరా, హెల్త్‌క్యాంపుల ఏర్పాటు, ఫైరింజన్ సౌకర్యం, హెల్ప్ సెంటర్ ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతరకు వచ్చే భక్తుల సంఖ్య దృష్ట్యా పటిష్ట భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు, అవసరమైన మేర చలువ పందిళ్ల ఏర్పాటు, తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా ఎక్కడికక్కడ చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బిల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కాసర్ల కుమార్, డీసీసీబీ డైరెక్టర్ మాద్గుల రమేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, నాయకులు ఐలయ్య, చెన్నోజు శ్రీనివాస్, జంగిలి రవి, వెంకటేష్, కోటి, తడండ్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవలో ఇండస్


ఇండస్ వేడుకల్లో రాకేశ్‌రెడ్డి దంపతులు(ఫైల్)


ఇండస్ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ తమిళసై (ఫైల్)

మహాశివరాత్రి వేళ పలు కార్యక్రమాలు
శివతత్వాన్ని బోధించడమే లక్ష్యంగా నిర్వహణ

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఏటా మహాశివరాత్రి పర్వదినం వస్తుందంటే చాలు.. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహించే ఇండస్ ఫౌండేషన్ ఓరుగల్లు ప్రజలకు యాదికొస్తుంది. ఏటా శివరాత్రికి హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించే వేడుకలు నగరవాసుల మదులను స్ఫురిస్తాయి. ఐదేళ్లుగా మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనాన్ని వైభవంగా నిర్వహిస్తున్న ఇండస్ ఫౌండేషన్.. ఈ ఏడాది కూడా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఓరుగల్లు వైభవాన్ని ఆధ్యాత్మిక, సాంస్కృతి, కళావైభవాన్ని చాటుతూ వైభవంగా అనేక మంది భిన్న రంగాల ప్రముఖులను నగరానికి రప్పించి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తుండటం గమనార్హం. ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేశ్‌రెడ్డి రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నప్పటికీ ఓరుగల్లు సాంస్కృతిక వైభవాన్ని ముందుకు తీసుకెళ్లడం, 400 ఏళ్ల నాటి కాకతీయుల కళావైభవంపై భవిష్యత్ తరాల వారికి అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2020లో తొలిసారిగా హయగ్రీవాచారి మైదానంలో ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టగా.. ప్రముఖ సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణి, శశిధర్‌శర్మ, భాస్కరయోగి లాంటి ప్రముఖులు పాల్గొన్నారు. 2021లో కరోనా వల్ల కార్యక్రమాలకు అంతరాయం కలగ్గా.. 2022లో గరికిపాటి నర్సింహారావు, బ్రహ్మశ్రీ గంగాధరశాస్త్రీ పాల్గొన్నారు. 2023లో అప్పటి గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఇండస్ ఫౌండేషన్ వేడుకలను ప్రారంభించిన క్రమంలో ఈ ఇండస్ కార్యక్రమాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అప్పుడు శతసహస్ర అవధాని మాడుగుల నాగఫణిశర్మ ప్రవచనం, జేడీ లక్ష్మీనారాయణ లాంటి ప్రముఖులు హాజరయ్యారు. 2024లో రాధా మనోహర్‌దాస్, బ్రహ్మశ్రీ గంగాధర శాస్త్రీ పాల్గొన్నారు.

ఇక ఈ ఏడాది మహాశివరాత్రి పర్వదినాన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్.రంగరాజన్, స్వామి ప్రణవనందాదాస్, ప్రముఖ కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర్‌రావుల ప్రవచనాలు, కవిత్వ ప్రసంగాలను ఏర్పాటు చేశారు. ఓరుగల్లు కళా వైభవంపై తెలంగాణ కవి దేశపతి శ్రీనివాస్ ప్రసంగం, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య బృందం యక్షగాన కచేరి, యువ సినీ గేయరచయిత అనంత శ్రీరామ్‌తో దేశభక్తి సందేశం, ఓరుగల్లులో పురుడుపోసుకున్న పేరిణి శివతాండవ ప్రదర్శన ఉంటాయి. లింగోద్భవ సమయంలో పరమశివుడి అనుగ్రహం కోసం సప్తహారతి నిర్వహిస్తున్నారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక, క్రీడా, కళా రంగాలకు చెందిన 8మంది ప్రముఖులకు కాకతీయ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. అలాగే సినీ గాయకుడు శ్రీకృష్ణ, తెలంగాణ మట్టిపాటల గాయకుడు మాట్ల తిరుపతి, పల్లెపాటల గాయని శిరీష, బుల్లితెర యాంకర్ సత్యభామ స్వాతి, అమ్మతనం ఉట్టిపడేలా పల్లెపాటలకు ప్రాణం పోస్తున్న భిక్షమమ్మ, అనితాయాదవ్ లాంటి కళాకారులతో జాగరణ ఉండే భక్తుల కోసం 12 గంటలపాటు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


ఆధ్యాత్మికం
గానం చేస్తున్న తనికెళ్ల భరణి

శివతత్వాన్ని ప్రబోధింపజేయడమే లక్ష్యం



శివభక్తులైన కాకతీయులు 400ఏళ్లపాటు పరిపాలించి.. వందలాది శివాలయాలు, రామప్ప, వేయిస్తంభాల గుడిలాంటి అత్యద్భుత శిల్పకళా సంపదను వారసత్వంగా అందించారు. వారి స్ఫూర్తిని ముఖ్యంగా శివతత్వాన్ని నేటి యువతకు భావితరాలకు అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. కళలు, సాహిత్యం, జానపదాలు, ఆధ్యాత్మికానికి పెట్టింది పేరైన ఓరుగల్లు కీర్తిని దేశవ్యాప్తంగా తెలియజెప్పడమే మా లక్ష్యం.

- ఏనుగుల రాకేశ్‌రెడ్డి, ఇండస్ ఫౌండేషన్

ప్రత్యేక ఆకర్షణగా ఇండస్ కార్యక్రమాలు



ప్రతీ శివరాత్రికి ఇండస్ ఫౌండేషన్ చేస్తున్న ఆధ్యాత్మిక సేవలు అద్భుతం. ఆ రోజున వరంగల్ నగరంలో జరిగే కార్యక్రమాలతో పాటు ఇండస్ నిర్వహించే కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. 2020 నుంచి ఏటా ఈ కార్యక్రమాల విజయవంతంలో భాగస్వామ్యం అవుతున్నందుకు సంతోషంగా ఉంది.

- శేషు, భద్రకాళి ఆలయ చైర్మన్

సిరులు కురిపిస్తున్న పొగాకు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం
- పంటపై సాగుకు ఆసక్తి చూపుతున్న అన్నదాతలు
- జనగామ జిల్లాలో పెరుగుతున్న విస్తీర్ణం


పొగాకు పంట


ఆరబెట్టిన పొగాకు దొర్నాలు

రఘునాథపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పొగాకు పంట రైతులకు సిరులు కురిపిస్తోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తుండడంతో జనగామ జిల్లాలో పొగాకు సాగు ఏటికేడు పెరుగుతోంది. స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి, పాలకుర్తి, దేవరుప్పుల, నర్మెట, లింగాలఘణపురం, కొడకండ్ల మండలాల్లో రైతులు ఎక్కువగా పొగాకు సాగు చేస్తున్నారు. జిల్లాలో సుమారు 1250 మంది రైతులు ఆరువేల ఎకరాలలో సాగు చేశారు. క్వింటా పొగాకు రూ.15,500ధర పలుకుతోంది. ఎకరాకు సుమారు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుండడంతో రూ.25 వేల నుంచి రూ.30 వేల ఖర్చు వస్తుంది. అంటే సుమారుగా ఎకరం పొగాకు పంట సాగు చేసిన రైతుకు అన్ని ఖర్చులు పోను రూ.1.20లక్షల ఆదాయం వస్తోందని పొగాకు రైతులంటున్నారు.

పొగాకు సాగు చేసే గ్రామాలు..

రఘునాథపల్లి మండలంలోని కుర్చపల్లి, గబ్బెట, కోడూరు, రామన్నగూడెం, కన్నాయిపల్లి, గోవర్ధనగిరి, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని ఛాగల్లు, రాఘవపురం, అక్కరాజుపల్లి, శివరెడ్డిపల్లి, మీదికొండ, ఇప్పగూడెం, నర్మెట, లింగాలఘణపురం మండలంలోని నేలపోగుల, గుమ్మడవెల్లి, బండ్లగూడెం తదితర గ్రామాల్లోని రైతులు పొగాకును ఎక్కువ సాగు చేస్తారు.

రఘునాథపల్లిలో కొనుగోలు కేంద్రం..

రైతుల నుంచి పొగాకు పంటను కొనేందుకు చేసేందుకు వీఎస్‌టీ ఆధ్వర్యంలో రఘునాథపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతులు పొగాకు ఉత్పత్తులకు నాణ్యత, రంగును బట్టి క్వింటాకు రూ.12 వేల నుంచి రూ.15,500 వరకు ధర పలుకుతోంది. దళారులు లేకపోవడంతో మోసాలు జరగడం లేదని రైతులు చెబుతున్నారు. పెట్టుబడులు పోను ఎకరానికి సగటున రూ.1.10 లక్షల వరకు ఆదాయం వస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పొగాకు సాగే మేలు



నేను రెండు ఎకరాల్లో పొగాకు సాగు చేశాను. ఇప్పటివరకు 10 క్వింటాళ్ల పొగాకును అమ్మగా రూ.1.40 లక్షలు వచ్చాయి. ఇంకా 10 నుంచి 12 క్వింటాళ్ల పొగాకు పంట చేతికి రావాల్సిఉంది. ఇతర పంటలకు అవరమైన పెట్టుబడులు పొగాకుకు అవసరం ఉండదు.అందుకే ఇతర పంటలకన్న పొగాకు సాగే మేలు..

- ఉత్తేపు కుమార్, బండ్లగూడెం

తక్కువ పెట్టుబడి..



పొగాకు పంటకు ఇతర పంటలతో పోలిస్తే తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభం వస్తోంది. 15 ఏళ్ల నుంచి పొగాకు సాగు చేస్తున్నాను .పొగాకుకు ఎక్కువ సాగు నీరు, రసాయన ఎరువుల వాడకం ఉండక పోవడం వల్ల తక్కువ పెట్టుబడి మాత్రమే అవసరముంటుంది. నేను 3 ఎకరాలలో పొగాకు సాగు చేశాను. పెట్టుబడి రూ.90 వేలు పోను రూ.2.20 లక్షల ఆదాయం లభించడం అంటే కేవలం పొగాకు సాగుతోనే సాధ్యం.

- పుట్టల గట్టయ్య, ఇప్పగూడెం


రఘునాథపల్లిలో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న పొగాకు బేళ్లు

బతుకు బండిని లాగుతున్న ముద్రణ జీవులు

పాలకులు మారినా ప్రింటర్స్‌లో కానరాని ప్రగతి

- తమ జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఆశతో ఎదురుచూపు
- నేడు ప్రపంచ ప్రింటర్స్ డే సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం


మానుకోటలో ఆఫ్‌సెట్ ప్రింటింగ్ మిషన్‌ను నడుపుతున్న యాజమాని నక్క నాగార్జున


జాన్‌గూటెన్ బర్గ్ చిత్రపటం

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూసి.. చూసి వారి కళ్లు కాయలు కాచాయి. రాష్ట్రాలు మారినా (సిద్ధించిన).. పాలకులు మారిన ప్రింటర్స్ జీవితాల్లో వెలుగులు నిండడం లేదు. సీజనల్ వ్యాపారంతో ఆరునెలలు మాత్రం పని దొరకడం. మిగతా ఆరునెలలు పని లభించక ఖాళీగా ఉండడంతో వారికి కుటుంబ పోషణ కష్టతరంగా మారుతోంది. అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సిన దైన్యస్థితి నెలకొంది. రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు, గృహా, దుకాణాల అద్దెలు పెరగడంతో వారు అష్టకష్టాలు పడుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఎటు పాలుపోని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఉన్న పనిని వదిలేయలేక కొత్త పని చేద్దామంటే పెట్టుబడికి ఆర్థిక స్థోమతలేక ముద్రణ పనిలోనే మగ్గుతూ అవస్థలు పడుతున్నారు. ప్రింటింగ్ పితామహుడు జాన్ గూటెన్ బర్గ్ జయంతి ఫిబ్రవరి 24 ప్రపంచ ప్రింటర్స్ డేను పురస్కరించుకుని ప్రింటింగ్ ప్రెస్ యాజమానులు, కార్మికుల కష్టాలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

లెటర్ ప్రెస్‌తో ముద్రణరంగంలో నూతన శకం

జర్మనీ దేశానికి చెందిన ప్రింటింగ్ పితామహుడు సర్ జోహన్స్ గూటెన్ బర్గ్ ఆలోచన, పట్టుదల 1450వ సంవత్సరంలో ముద్రణ రంగానికి నాంది పలికాయి. పాత తరం ఆచార వ్యవహారాలు, సం స్కృతి, సంప్రదాయాలు, నాగరికత, రాజకీయ, సాంస్కృతిక, విద్యా, వైజ్ఞానిక రంగాలకు చెందిన విషయాలను భావితరాలకు అందించడంలో ముద్రణారంగం ప్రముఖపాత్ర పోషిస్తోంది. ఇసుకతిన్నెలపై అక్షరాలు రాసుకోవడం, చెక్క పలకలపై బొగ్గుతో, నల్లని పలకలపై సుద్దముక్కలతో, కాగితాలపై సిరాతో రాయడం మొదలైంది. పూర్వకాలంలో తాళపత్ర గ్రంథాలు తాటి ఆకులపై ఘంటం అనే మేకులాంటి ఆయుధంతో గీరుతూ ఓ గ్రంథాన్ని తయారు చేసేవారు. అయినా అందులో రాసిన విజ్ఞానాన్ని నలుగురికి పంచలేకపోగా దాన్ని భద్రపరిచేందుకు ఇబ్బందులు ఎదురయ్యేవి. ఇది గమనించిన జాన్ గూటెన్‌బర్గ్ పూర్వ విజ్ఞానాన్ని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ముద్రణాయంత్రాన్ని కనుగొన్నారు.విడి అక్షరాలతో ముద్రించే లెటర్‌ప్రెస్‌ను కనుగొని ముద్రణ రంగంలో నూతన శకానికి నాందిపలికారు. ఇనుప రాడ్లతో అక్షరాలుగా చెక్కి వాటిని వరుస క్రమంలో పేర్చి తద్వారా అవసరమైన పుస్తకాలను తయారు చేసేవారు. సదరు ప్రింటింగ్‌పై ఏరోజు కారోజు వార్తలను అందించే దినపత్రికలను సైతం ముద్రించారు. కంప్యూటర్ రంగం అంటుబాటులోకి వచ్చాక లెటర్‌ప్రెస్ నుంచి ఆఫ్‌సెట్ ప్రింటింగ్ స్థాయికి ఎదిగింది. అంతటితో ఆగకుండా మల్టీకలర్ ప్రింటింగ్‌ను కూడా అవలీలగా ముద్రిస్తున్నారు. తద్వారా గంటలో వేలకొద్ది పత్రాలను ముద్రించడంతో పాటు ప్రజా అవసరాలకు ఉపయోగపడే పుస్తకాలను అందిస్తోంది.

సంక్షేమ పథకాలు..

రోజు రోజుకు సాంకేతికాభివృద్ధి చెంది ప్రజల అవసరాలకనుగుణంగా అతితక్కువ సమయంలో ఎక్కువగా ముద్రణా జరుగుతుందే తప్ప, వాటిని ముద్రించే ప్రింటింగ్ ప్రెస్ యజమానులు, కార్మికుల జీవనస్థితిగతుల్లో మాత్రం మార్పు కన్పించడం లేదు. రోజురోజుకు వారి జీవన, ఆర్థిక స్థితి గతులు వెనక్కి నెట్టబడుతున్నాయంటే అతిశయోక్తి కాదు. పొద్దంతా కష్టపడ్డప్పటికి వారి కుటుంబాలు గడవని దైన్యదుస్థితి నెలకొంది. ఎందరికో విజ్ఞానాన్ని అందించే పుస్తకాలను ముద్రించే ప్రింటర్లు అభివృద్ధికి ఆమెడదూరంలో ఉన్నారు. స్వరాష్ట్రం సిద్ధిస్తే తమ బతుకులు మారుతాయని ఆశపడి తాము సైతం అంటూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాల్లో ముందుండి పోరాటాలు నిర్వహించారు. స్వరాష్ట్రం ఏర్పాటై దశాబ్ద కాలం గడిచి పోయినా, పాలకులు మారినా ప్రింటర్స్ జీవన ప్రమాణాలు మెరుగు పడలేదు. పాలకులు స్పందించి ప్రింటర్లను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేసి, దుకాణాల నిర్వహణకు బ్యాంకు రుణాలు అందించడంతో పాటు షాపులకు ఉచిత విద్యుత్ అందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పడిపోతున్న మిర్చి ధరలు

- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- వ్యాపారులు కుమ్మక్కై తగ్గిస్తున్నారని ఆరోపణ
- ఎగుమతులు లేకపోవడమే కారణమంటున్న వ్యాపారులు
- గతేడాది కొన్నదే స్టోరేజీల్లో మూలుగుతోందని ఆవేదన
- ప్రభుత్వమే ఆదుకోవాలంటున్న రైతులు


వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన మిర్చి బస్తాలు

వరంగల్ వ్యవసాయం, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్లో మిర్చి ధరలు రోజురోజుకూ పడిపోతున్నాయి. పెట్టిన పెట్టుబడి, వచ్చిన దిగుబడి, మార్కెట్లో పలుకుతున్న ధర చూస్తే ఏ మాత్రం పొంతనలేకుండా పోతోందని, ఇలాగే కొనసాగితే అప్పులపాలవడం ఖాయమని రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్లో వ్యాపారులందరు కుమ్మక్కై మిర్చి ధరలు తగ్గిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కానీ, ఎగుమతులు తగ్గడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

గతంలో కొన్న మిర్చి ఇప్పటికీ కోల్డ్ స్టోరేజీల్లో మూలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2023లో క్వింటా మిర్చి రూ.99వేలకు చేరడంతో 2024లో రైతులు అధికంగా సాగుచేశారని, దీంతో ధరలు కనిష్టంగారూ.20 వేలకు పడిపోయాయని, అపుడు కొనుగోలు చేసి కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేశామని అంటున్నారు. కానీ, ఇతర దేశాలకు ఎగుమతులు లేకపోవడంతో ప్రస్తుతం గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు పలుకుతోందని, ఈ నేపథ్యంలో ఉన్న సరుకును ఏం చేయాలో పాలుపోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. పక్క రాష్ట్రం గుంటూరులో ఇటీవల మిర్చి ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చేశారని, వెంటనే ప్రభుత్వం స్పందించి కేంద్ర వ్యవసాయశాఖతో మాట్లాడిందని, గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారని గుర్తుచేశారు. ఆ దిశగా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఆదుకోవాలి..

మిర్చి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. విత్తనం వేసినప్పటి నుంచి మిర్చి మార్కెట్‌కు చేరేంత వరకు ఖర్చు ఎంతైంది..? రైతు శ్రమ ఎంతుంది..? లెక్క కట్టి గిట్టుబాటు ధర నిర్ణయించాలని కోరుతున్నారు.

ఆందోళన చెందుతున్న వ్యాపారులు

గతేడాది కొన్న సుమారు పది లక్షల మిర్చి బస్తాలు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసి ఉన్నాయని, ఈ ఏడాది కూడా ఎగుమతులు లేకపోవడంతో ధరలు తగ్గుముఖం పడుతున్నాయని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

వరంగల్ మార్కెట్‌కు వచ్చే ప్రధానమైన మిర్చి రకాలు, గరిష్ట ధరలు

మిర్చి రకం	2022 ఫిబ్రవరి	2023 ఫిబ్రవరి	2024 ఫిబ్రవరి	2025 ఫిబ్రవరి
దేశీ మిర్చి	29.000	73.000	42.000	25.000
వండర్‌హాట్	23.000	37000	23.600	14.500
తేజ	18.800	20.000	22.000	14.000
యూఎస్ 341	25.000	21.900	20.000	13.500
డిడి	21.500	19.900	------	-----
దీపిక	-----	34.000	23.000	16.000

ధరలు ఆందోళన కలిగిస్తున్నాయి..



మిర్చి ధరలు సగానికి సగం తగ్గిపోయాయి. సాగు ఖర్చులు బాగా పెరిగిపోయాయి. విత్తనాలు వేయడం నుంచి పంట చేతికి వచ్చే సరికి కూలీలకు, ఎరువులకు, రసాయన మందులకు ఇలా అన్నింటికీ రేట్లు పెరిగాయి. కానీ రైతులు పండించిన పంటకు ధరలు పెరుగడంలేదు. ఈ ప్రభుత్వమైనా స్పందించి రైతుల పెట్టుబడి పోను లాభం వచ్చేలా గిట్టుబాటు ధరలు నిర్ణయించి ప్రభుత్వ సంస్థలచే కొనుగోలు చేయాలి. అప్పుడే రైతులు బాగుపడుతారు. లేదంటే రైతులకు అప్పులే మిగిలిపోతాయి.

- రాజు, రైతు, పరకాల

గతేడాది క్వింటా మిర్చి రూ.20 నుంచి 40 వేలు పెట్టి కొనుగోలు చేశామని, ప్రస్తుతం మార్కెట్లో రూ.10 వేల నుంచి రూ.20 వేలే ఉందని వాపోతున్నారు. ప్రస్తుత ధరకు అమ్మితే నష్టం వస్తుందని, పోనీ అలాగే నిల్వ ఉంచితే రానున్న రోజుల్లో మిర్చి ధర మరింత తగ్గితే దివాలా తీసి ఇంటిముఖం పట్టాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు.

పరీక్ష రాయనని విద్యార్థి మారం


విద్యార్థికి ధైర్యం చెబుతున్న అధికారులు, పోలీసులు

బుజ్జగించి పరీక్షా కేంద్రంలోకి పంపించిన పోలీసులు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : కేయూసీ పోలీసు స్టేషన్ పరిధి పలివేల్పుల రోడ్ తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో ఆదివారం టీజీ సెట్ ప్రవేశ పరీక్ష జరిగింది. ఈ క్రమంలోనే ఓ విద్యార్థి తాను పరీక్ష హాలులోకి వెళ్లనని.. భయమేస్తోందని మారం చేస్తూ తండ్రితో వచ్చిన ఆ విద్యార్థి మారం చేస్తున్నాడు. అప్పుడే బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు పరీక్షా కేంద్రానికి వచ్చిన హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డితో పాటు అక్కడే విధులు నిర్వహిస్తున్న కేయూసీ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ ఆ విద్యార్థిని బుజ్జగించి ధైర్యం చెప్పి పరీక్షా కేంద్రంలోకి పంపించాడు.

శిథిలావస్థలో చెక్‌డ్యాంలు

- ఆకేరు, మొండివాగులలో వరదలకు ధ్వంసం
- నెల్లికుదురు మండలంలో వృథాగా పోతున్న నీరు
- మరమ్మతులు చేయాలని రైతుల విజ్ఞప్తి


రామన్నగూడెం ఆకేరువాగులో కూలిపోయిన చెక్‌డ్యాం

నెల్లికుదురు, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెక్‌డ్యాంలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వానాకాలంలో వర్షం నీటిని నిల్వఉంచి, వానలు లేని సమయంలో వ్యవసాయ బావులు, బోర్లలో భూగర్భ జలాలను పెంచాలనే ఉద్దేశంతో.. గతంలో ఆయా గ్రామాల్లోని మైదాన ప్రాంతాల్లో వరద కాలువలకు చెక్‌డ్యాములు నిర్మించారు. అవి కాలక్రమేనా శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షకాలంలో వరద ఉధృతికి కొన్ని చెక్ డ్యాములు కూలిపోయాయి. నెల్లికుదురు మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో 40 చెక్‌డ్యాములు నిర్మించారు. రావిరాల, మునిగలవీడు, మదనతుర్తి గ్రామాల రైతులకు నీరునిల్వ ఉండటానికి మొం డివాగుపై నాలుగు చెక్‌డ్యాములు నిర్మించారు. అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. రామన్నగూడెంలో 4 చెక్‌డ్యాములు నిర్మించగా, అవి కూలిపోయే దశకు చేరుకున్నాయి. నెల్లికుదురు పరిధిలో 4 చెక్‌డ్యాములు నిర్మించగా, అవి రైతులకు ఉపయోగకరంగా లేవు. నామమాత్రంగా నిర్మించి బిల్లులు కాజేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీరామగిరి పరిధిలో 7, ఆలేరు పరిధిలో 6, నర్సింహులగూడెం పరిధిలో 2, మేచరాజుపెల్లి పరిధిలో 4, ఎర్రబెల్లిగూడెం పరిధిలో 3 చెక్కుడ్యాములు పదేళ్ల క్రితం నిర్మించారు. అవి నాసిరకంగా నిర్మించడంతో బీటలు ఏర్పడి వర్షాకాలంలో నీరు వృథా అవుతుంది. వాటికి మరమ్మతులు చేయాలని రైతులు కోరుచున్నారు.

ఆకేరువాగులో కూలిపోయిన చెక్‌డ్యాంలు..

ఆకేరువాగులో నీరునిల్వ ఉండటానికి మేచరాజుపల్లి, ఎర్రబెల్లిగూడెం, నెల్లికుదురు శివారు ఆకేరువాగులో అక్కడక్కడా 5 చెక్‌డ్యాములు నిర్మించారు. ఆ డ్యామ్‌లు ఉన్నచోట అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టడంతో అవి కూలిపోయే దశకు చేరుకున్నాయి. రామన్నగూడెం ఆకేరువాగులో గత ప్రభుత్వం రూ. 7 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారు.గత ఏడాది ఆకేరువాగు ఉధృతంగా ప్రవహించడంతో బీటలు ఏర్పడి కూలిపోతుంది. దీంతో ఆకేరువాగు ఒడ్డు రైతుల భూములు కొట్టుపోయి భారీగా నష్టం జరిగింది. నాసిరకం పనులు చేపట్టడంతో ఏడాది గడవకముందే చెక్‌డ్యాం కూలిపోయింది.

బ్రాహ్మణకొత్తపల్లి శివారు ఆకేరువాగులో చెక్‌డ్యాం పూర్తిగా పాడైపోయింది. కోట్లాది రూపాయలతో నిర్మించిన చెక్‌డ్యాం కూలిపోయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నీటి నిల్వలకు ఇబ్బందులు

నెల్లికుదురు మండలంలో అవసరంలేని చోట చెక్‌డ్యాములు నిర్మించడంతో అవి రైతులకు ఉపయోగకరంగా లేకపోవడంతో వర్షకాలంలో నీరు నిల్వఉన్నా, వేసవి సీతాకాలలో నీరు ఇంకిపోయి నిరుపయోగంగా మారాయి. వేసవి సమీసిస్తుండటంతో భూ గర్భజలాలు అడుగంటిపోయి, పంటలు ఎండిపోపే దశకు చేరుకున్నాయి. ఇప్పటికెనా బీటలు ఏర్పడిన చెక్‌డ్యామ్‌లను మరమ్మతులు చేపట్టి, నీరు నిల్వఉండే మైదాన ప్రాంతాలలో నూతన చెక్‌డ్యాములు నిర్మిస్తే వర్షపు నీరునిల్వ ఉంటుందని ఆయా గ్రామాల రైతులు అధికారులు కోరుతున్నారు.

చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపట్టాలి

మైస రాములు, రైతు రామన్నగూడెం



రామన్నగూడెం ఆకేరువాగులో రూ.7 కోట్లతో ఏడాది క్రితం నిర్మించిన చెక్‌డ్యాం కూలిపోయింది. దీంతో రైతుల భూములు కొట్టుకపోయాయి. మళ్లీ మరమ్మతులు చేయాలి. 20 ఎకరాలు కొట్టుకపోయాయి.. నష్టపరిహారం చెల్లించాలని అధికారులకు దరఖాస్తులు పెట్టుకున్నప్పటికీ పరిహారం అందలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

మూడు అంబులెన్స్‌లు మారి.. చివరికి 108 వాహనంలోనే ప్రసవం


అంబులెన్స్‌లో మగశిశువుకు జన్మనిచ్చిన నాగమ్మ

గూడూరు, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన నడిమె నాగమ్మ 9నెలల నిండుగర్భిణీ కొత్తగూడెంలోని సమీప బంధువుల ఇంటికి ఓ శుభకార్యానికి హాజరైంది. అక్కడ పురిటినొప్పులు రావడంతో 108 ద్వారా స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు.. వరంగల్ సీకేఎం ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ్నుంచి నాగమ్మను ఒకదాని తర్వాత మరొకటి మూడు అంబులెన్స్‌లు మార్చారు. చివరకు గూడూరు 108 అంబులెన్స్‌కు కేసు రావడంతో వారు వరంగల్ సీకేఎం ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో ధర్మారం చేరుకోగానే పురిటినొప్పులు ఎక్కువ కావడంతో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శ్రీనివాస్ సాధారణ ప్రసవం చేశారు. దీంతో నాగమ్మ మూడోకాన్పులో పండంటి మగశిశువుకు జన్మనిచ్చింది. తల్లి, శిశువును సీకేఎం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఇరువురి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. మహిళకు సాధారణ ప్రసవం చేసిన అంబులెన్స్ సిబ్బంది పి.శ్రీనివాస్, శ్రీకాంత్‌ను పలువురు అభినందించారు.

ఆదమరిస్తే.. అంతే.!

- రోడ్డపై మొక్కజొన్నలు ఉన్నాయ్.. జాగ్రత్త


జాతీయ రహదారిపై మొక్కజొన్నలు ఆరబోసిన దృశ్యం

గూడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహబూబాబాద్-నర్సంపేట జాతీయ రహదారిపై పలు గ్రామాల్లోని రైతులు మొక్కజొన్నలను ఆరబెట్టారు. వాహనదారులు తస్మాత్ జాగ్రత్త..! ఆదమరిస్తే అంతే.. సంగతులు ప్రాణాలే.. పోవొచ్చు.. గాయాలే కావొచ్చు..? గూడూరు మండలంలోని రైతులకు కల్లాల కొరతతో మొక్కజొన్నలను ఓపక్క పోసి ఆరబెట్టుకుంటున్నారు. రాత్రి సమయాల్లో ఆరబోసిన మొక్కజొన్నలపై నల్లని పాల్తీన్ కవర్ కప్పడంతో అవి కన్పించడం లేదు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయి. మహబూబాబాద్ -నర్సంపేట జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉంటూ నడుపోవాలని ప్రజలు కోరుతున్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- బంగారు పుస్తెలతాడు, రూ.5వేల నగదు రికవరీ
- వివరాలు వెల్లడించిన టౌన్ సీఐ దేవేందర్

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో చోరీ జరిగిన 5 గంటల్లోనే మహబూబాబాద్ టౌన్ పోలీసులు, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి, కేసును ఛేదించినట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలప్రకారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన కోట్ల ముత్యాల్‌రావు మహబూబాబాద్ మండలం దర్గాతండాలో డంపింగ్‌యార్డులో కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంత కాలం నుంచి పాల్వంచ, భద్రాద్రికొత్తగూడెం, భద్రాచలం, ఖమ్మం, మహబూబాబాద్ టౌన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతూ పట్టుబడి జైలుకు వెళ్లినట్లు చెప్పారు. 2024లో కూడా మహబూబాబాద్ టౌన్‌లో జరిగిన చోరీ కేసులో జైలుకు వెళ్లినట్లు చెప్పారు. ఆ తర్వాత జైలు నుంచి బయటకు వచ్చి దర్గాతండా డంపింగ్‌యార్డులో పనిచేస్తూ వచ్చే వేతనం సరిపోక దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. మహబూబాబాద్ టౌన్‌లో తిరుగుతూ ఓ సైకిల్‌ను దొంగిలించి అదేరోజు రాత్రి మర్వాడీ బజారులో కొండ్లె శ్రీనివాస్-సాయిప్రసన్నలు ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో ఇంట్లో ఉన్న రూ.5 వేల నగదుతో పాటు సాయిప్రసన్న మెడలోని పుస్తెలతాడును లాక్కొని వెళ్లాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో సైకిల్‌పై పరారయ్యాడని చెప్పారు. సీసీ కెమెరాలను పరిశీలించగా, పాత నేరస్తుడు కోట్ల ముత్యాల్‌రావుగా నిర్ధారణకు వచ్చి విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకుని దొంగిలించిన సొత్తును పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. ఈ కేసును చాకచక్యంగా వ్యవహరించి ఛేదించిన టౌన్ సీఐ దేవేందర్, సీసీఎస్ ఎస్సైలు తహెర్‌బాబా, గోపి, టౌన్ ఎస్సైలు విజయ్‌కుమార్, శివ, క్రైమ్ సిబ్బంది, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌ కేకన్ అభినందించారు.


కేసముద్రం ఎస్‌వీ హైస్కూల్లో సమావేశమైన పూర్వ విద్యార్థులు


సమ్మేళనంలో పాల్గొన్న 1999-2000 టెన్త్‌బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మరిపెడ, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి) : 1999-2000 సంవత్సర టెన్త్‌బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం మరిపెడ మండలకేంద్రంలోని హైస్కూల్‌లో అపూర్వంగా నిర్వహించుకున్నారు. పాఠశాలను వదిలి వెళ్లి ఎక్కడెక్కడో స్థిరపడిన అప్పటి విద్యార్థులు ఇప్పుడు అదే పాఠశాలలో కలుసుకొని తమ చిన్ననాటి మధురస్మృతులను, చేదు జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఒక్కరికి ఒక్కరూ తమ బాగోగులను అడిగి తెలుసుకున్నారు. యోగక్షేమాలు, ఆర్థిక స్థితిగతులపై మాట్లాడుకున్నారు. అప్పటి గురువులు వీరస్వామి, గోపాల్‌రెడ్డి, సోమయ్య, తిరుమల, రాంచంద్రయ్యను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భాస్కర్, వీరన్న, ఉపేందర్, రవి, గోపాల్, అప్పన్న, దేవేందర్, పరుశరాములు, నిర్మల, రాజేశ్వరి, సువర్ణ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

● కేసముద్రం, (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్ ఎస్‌వీ హైస్కూల్ 2015-16 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆ పాఠశాలలో సమావేశమయ్యారు. పదేళ్ల అనంతరం కలుసుకున్న తమ స్నేహితులతో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు చాంద్, మల్లయ్య, వెంకటేశ్వర్లు, చారి, మధు, నూర్జహాన్, నరేష్, సుధాకర్, మల్లేషం, నాగరాజులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు శిరీష, అంజలి, అనూష, జ్యోతి, మోహన్, సందీప్, రోహిత్, గగన్, మహేందర్ పాల్గొన్నారు.

సరైన సౌకర్యాలు కల్పించాలి

- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 27న జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు సరైన సౌకర్యాలు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి చాగంటి ప్రభాకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగ ఓటర్లకు సహాయపడటానికి ఆశా వర్కర్లు ఉన్నప్పటికీ పురుష దివ్యాంగులు వచ్చినప్పుడు వారిని వీల్‌చైర్ల నుంచి లేపడానికి ఆశా వర్కర్లు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రం వరకు వీల్‌చైర్ అనుమంతిచాలని, బదిర కంటి చూపులేని వారికి, శారీరక వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఓటు వినియోగంలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. దరావత్ భద్రునాయక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటి స్థల సాధనకు మరో పోరాటానికి సిద్ధం కావాలి'

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారులు 250 గజాల ఇంటిస్థల సాధనకు మరో పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు అహ్మద్‌ఖాన్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం తెలంగాణ ఉద్యమకారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా తెలంగాణ ఉద్యమకారులకు ప్రతీ ఒక్కరికి 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని, లేని పక్షంలో స్థల సాధనకు మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని చెప్పి, నెలలు గడిచినా ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వకపోవడంతో ఉద్యమకారులు తీవ్ర ఆవేదనతో ఉన్నారని చెప్పారు. ఇళ్ల స్థలాలు సాధించేంత వరకు పోరాటాలు నిర్వహించాలని తెలంగాణ ఉద్యమకారులు ముక్తకంఠంతో తీర్మాణించారు. ఈ సమావేశంలో దార్ల శివరాజ్, పుచ్చకాయల రామకృష్ణ, చెక్కల అశోక్, తెలంగాణ శ్రీను, పొన్నాల యుగేందర్, ఇంతియాజ్, నాసర్, గుంజె హన్మంతు, అంబరీష, సోమన్న, సీతారాములు, నలమాస సాయి పాల్గొన్నారు.

'ఢిల్లీ సదస్సును జయప్రదం చేయాలి'


కేసముద్రంలో కరపత్రాలను విడుదల చేస్తున్న మాస్‌లైన్ పార్టీ నాయకులు

కేసముద్రం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో ఈ నెల 28న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే అఖిల భారత సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ కేసముద్రంలో ఆదివారం కరపత్రాలను పార్టీ సంయుక్త మండల కార్యదర్శి పైండ్ల యాకయ్య ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ దేశంలో మైనార్టీలు, నిమ్న కులస్థులను కొన్ని శక్తులు వేధింపులకు గురిచేస్తోంటే కేంద్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పార్టీ డివిజన్ నాయకులు కందాల రంగయ్య, పెరుమాండ్ల జానకిరాములు, జంపాల రాము, సుధాకర్, భద్రు పాల్గొన్నారు.

క్రిష్ణానగర్‌లో బాలకుమారస్వామి జాతర


బాలకుమారస్వామికి పూజలు చేస్తున్న పూజారులు

గంగారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మడగూడెం పంచాయతీ పరిదిలోని క్రిష్ణానగర్‌లో ఆదివారం చుంచ వారి ఇలవేల్పు బాలమార స్వామి జాతరను ఘనంగా ప్రారంభించారు. ఉదయం గ్రామ శివారులో కొలువై ఉన్న బాలకుమార స్వామికి చుంచ వంశానికి చెందిన వారు పూజలు చేశారు. స్వామి వారికి సాయంత్రం గంగా స్నానం చేయించిన అనంతరం చుంచా వారి ఆడపడుచులు ఆలయంలో గుడి మెలుగుట కార్యక్రమం చేశారు. అనంతరం స్వామివారిని గిరిజన సాంప్రదాయాల నడుమ మేళ తాళాలతో ఊరేగింపుగా గద్దెపైకి తీసుకువస్తారు. స్వామివారి పడిగలు, గజ్జలు, ఇతర సామగ్రి గద్దెపై ఉంచి పూజలు చేసిన అనంతరం చుంచ వంశానికి చెందిన వారు మొక్కులు తీర్చుకుంటారని బాలకుమారస్వామి తలపతి చుంచ శ్రీను తెలిపారు. ఆదివారం రాత్రి గిరిజన నృత్యాలతో జాగారం చేసి సోమవారం ఉదయం స్వామిని వన ప్రవేశం చేస్తారని తెలిపారు. దీంతో జాతర ముగుస్తుందని ఆయన తెలిపారు. పూజారులు పెండకట్ల బుచ్చిరాములు, సారయ్య, చంద్రయ్య, ఎర్రయ్య, సుధాకర్, పడిగలు యాప భూమయ్య, క్రిష్ణయ్య, శ్రీరాములు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం'



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య

గార్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యంకాని హామీలును గుప్పించి అధికారం చేపట్టి ఏడాది దాటినా హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య విమర్శించారు. ఆదివారం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో జరిగిన అపార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో మూడవసారి అధికారం చేపట్టిన బీజేపీ పార్టీ, రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ పథకాలు అమలు చేయడంలో అనుసరిస్తున్న తీరు చూస్తే ఒకే విధంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేవలం పాలన బదాలాయింపు జరిగింది. తప్పా పాలకుల విధానాలు మాత్రం మారలేదన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వంలో భారతదేశ సంపదను కర్పొరేట్ శక్తులకు దారాదత్తం చేయడం జరుగుతుందని విమర్శించారు. దేశంలో, రాష్ట్రంలో సామాన్య ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందే వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి, జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాస్, నాయకులు గడిపాటి రాజారావు, అంబటి వీరస్వామి, వంగూరి పెద్ద వెంకటేశ్వర్లు, ఇమ్మడి గోవింద్, బొబ్బ ఉపేందర్ రెడ్డి, మలెల నాగమణి, చింత మౌనిక రామకృష్ణ, మౌలానా పాల్గొన్నారు.

విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన విధంగా విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలన్నారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందని, అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కళాశాలల్లో ర్యాంకులు, మార్కులు కోసం విద్యార్థులకు విశ్రాంతి లేకుండా వత్తిడి చేస్తూ చదివించడం వలన మనోవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వాటిని వెంటనే కట్టడిచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు బోనగిరి మధు, మాదారపు నాగరాజు, మునగాల మహేష్, దిలీప్, గణేష్ పాల్గొన్నారు.

'రక్తదానం మరొకరికి ప్రాణదానం'

తొర్రూరు, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం మరొకరికి ప్రాణదానం అని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ డొనేషన్ క్యాంపు వైద్యుడు పృథ్వీరాజ్ అన్నారు. ఆదివారం తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడుతూ మనం ఒకరికి రక్తదానం చేస్తే అనారోగ్యంగా ఉన్న వారికి సాయం చేసినట్లే అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. యువకులు రక్తదానం చేయడం అభినందనీయమని అన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ సంవత్సరంలో 4సార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. ఈ శిబిరంలో 90 యూనిట్ల రక్తాన్ని సేకరించామన్నారు. రక్తదానం చేసిన యువతకు సర్టిఫికెట్‌లు అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్సీగా సుందర్‌రాజ్‌ను గెలిపించాలి

తొర్రూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : వరంగల్-ఖమ్మం-నల్గొండ ఎమ్మెల్సీగా స్వతంత్ర అభ్యర్థి సుందర్‌రాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సామాజికవేత్త, ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘం నాయకుడు బి.కుమారస్వామి అన్నారు. ఆదివారం సుందరరాజ్ గెలుపు కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో సుందర్‌రాజ్ తనవంతుగా విశేష కృషి చేశాడని, ఎంతోమంది యువతను ముందుండి నడిపించిన నాయకుడని అన్నారు. 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సుందర్‌రాజ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. రమేష్, పాష, మహబూబ్, రాజు ఉన్నారు.

గూడూరులో చేపలు కిలో రూ.100

గూడూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : అసలే.. ఆదివారం.. ముక్కలేనిదే.. ముద్ద దిగని మాంసం ప్రియులకు చౌకబేరానికి చేపలు దొరికాయి. కిలో వంద రూపాయలే అంటూ పిలిచి మరి అమ్మారు. గూడూరు మండలం మర్రిమిట్ట గ్రామానికి చెందిన చేపల చెరువుల నిర్వాహకులు చంద్రుని చెరువులో సీడ్‌లోపంతో చేపలు సైజు పెరగకపోవడంతో పట్టిన చేపలను ట్రాక్టర్ ద్వారా గూడూరు మండల కేంద్రానికి తీసుకువచ్చారు. హోల్‌సేల్ మార్కెట్ ఏర్పాటు చేసి కిలో చేపలను రూ.100కు విక్రయించారు. దీంతో చేపల కొనుగోలు కోసం ప్రజలు ఎగబడ్డారు. మార్కెట్‌కు వచ్చిన చేపలు కారుచౌకగా అమ్ముడుపోయాయి.

అనారోగ్యానికి గురైన వ్యక్తికి సాయం

డోర్నకల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కేంద్రానికి చెందిన రెడ్డబోయిన శ్రీనివాస్ 15రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని కార్పొరేట్ అస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న శ్రీనివాస్ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు మాద శ్రీనివాస్, తాళ్లూరి హనుమ, వాంకుడోతు వీరన్న, సత్తిరెడ్డి, మల్లం అనిల్ ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లి శ్రీనివాస్ కుటుంబసభ్యులకు రూ.50 వేలు అందించారు.

రాష్ట్రానికే తలమానికంగా టీబీసీ

- టీబీసీ ఫౌండర్ విక్రమ్‌పాల్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ బిషప్స్ కౌన్సిల్ (టీబీసీ)ని బలోపేతం చేసి, రాష్ట్రానికే తలమానికంగా తీర్చిదిద్దాలని టీబీసీ ఫౌండర్ బిషప్ విక్రమ్‌పాల్ కోరారు. మహబూబాబాద్ పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌కాలనీలో ఆదివారం తెలంగాణ బిషప్స్ కౌన్సిల్ రాష్ట్రకార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీసీ అభివృద్ధికి కౌన్సిల్ సభ్యులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో హైదరాబాద్‌లో జరిగే టీబీసీ సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు. జిల్లాల వారీగా సర్వసభ్యసమావేశాలు నిర్వహించి,సంఘం బలోపేతానికి పాటు పడాలన్నారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి బిషప్ మల్సూర్‌నాయక్, ఏసు పాదం, డేవిడ్‌రాజు, ఇశ్రాయిల్, లాల్‌సింగ్ పాల్గొన్నారు.


తెలంగాణ బిషప్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న బిషప్ విక్రమ్‌పాల్


అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి తరుపున ఓటరు స్లిప్పులను అందజేస్తున్న పీఆర్టీయూ-టీఎస్ నాయకులు

శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27న జరగనున్న నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ-టీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఏఐఎఫ్‌టీవో జాతీయ ఉపాధ్యక్షురాలు గీత, పీఆర్టీయూ-టీఎస్ రాష్ట్ర అసోసియేట్‌అధ్యక్షుడు కల్లెం వెంకటరెడ్డి కోరారు. మహబూబాబాద్‌లో ఆదివారం సంఘం ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం నిర్వహించి ఓటర్లకు ఓటరు స్లిప్పులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసే సంఘం పీఆర్టీయూ-టీఎస్ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీపాల్‌రెడ్డిని గెలిపించి శాసన మండలిలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే అవకాశాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు గుగులోతు హేల్యానాయక్, కోట కనకయ్య, ఆకారపు వెంకటేశ్వర్లు, భవాని, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

చంద్రమోహన్‌కు ఓటు వేయాలి..

ఈ నెల 27న జరగనున్న నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రిటైర్డ్ డీఈవో ఏలె చంద్రమోహన్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రాజేంద్రప్రసాద్, సంపత్‌కుమార్ అన్నారు. మహబూబాబాద్‌లో ఆదివారంచంద్రమోహన్ గెలుపు కోరుతూ ఉపాధ్యాయ ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహించి విద్యారంగాభివృద్ధికి కృషి చేసిన అనుభవం ఉండటంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలకు కూడా తెలిసిన వ్యక్తి చంద్రమోహన్ అని వారికి ఓటు వేసి శాసన మండలికి పంపించాలని కోరారు.